# శ్రీ ఆనంద ఆంజనేయం

(శ్రీ స్వామివారిచే అనుగ్రహింపబడిన దివ్య కథలు)



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి




శ్రీరామరామ రామేతి రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ ఆనంద ఆంజనేయం

(శ్రీ స్వామివారిచే అనుగ్రహింపబడిన దివ్య కథలు)



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

శ్రీ

శ్రీ డిజైన్స్

www.lordofsevenhills.com

హైదరాబాదు

2013

# శ్రీ ఆనంద ఆంజనేయం

**(శ్రీ స్వామివారిచే అనుగ్రహింపబడిన దివ్య కథలు)**

© సర్వహక్కులు రచయితవి.

ప్రథమ ముద్రణ

**2013**

**వెల :**

**Rs. 20/-**

**కాపీలకు**

**"Viswapathi"**

**T.V.R.K. MURTHY, M.Tech**

Flat No. 202, Plot No. 32,
Srikar's Ravi Residency,
Beside Nalanda High School,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, India.
Ph : 040 - 23833752.
Cell : 98494 43752
Website : www.lordofsevenhills.com
Email: viswapathi@yahoo.com
vediclogos@yahoo.com

Designed & Printed at :

**SRI VASAVI GRAPHICS,**

1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

# నివేదన

యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్
తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్
బాష్పవారి పరిపూర్ణ లోచనమ్
మారుతిం నమత రాక్షసాంతకమ్

శ్రీ ఆంజనేయుడు భక్త సులభుడు. ఆయనను నిత్యం స్మరించేవారికి బుద్ధి, బలం, యశస్సు, తేజస్సు, ధైర్యం కలుగుతాయి. ఎటువంటి అనారోగ్యమైనా వెంటనే తొలగిపోతుంది. సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దయవలన నేను ఇప్పటిదాకా ఆ స్వామి లీలలపై పదిహేను పుస్తకాలు రచించటం జరిగింది. ఆ స్వామి దయతో ఇవన్నీ భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. వీటిలో ముఖ్యంగా శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పము, శ్రీ నరసింహ వ్రతకల్పము ఎంతో ప్రాచుర్యం పొంది దేశ విదేశాలలో భక్తుల ఇళ్ళలోను, అనేక దేవాలయాలలోను నిత్యం ఆచరింపబడుతున్నాయి. నా ఆప్తులు కొంతమంది ఎప్పటినుంచో నన్ను శ్రీ ఆంజనేయుల వారి లీలలపై పుస్తకం రచింపవలసిందిగా కోరుతున్నారు. ఆ స్వామి అనుగ్రహం అయినప్పుడు తప్పక వ్రాయగలనని చెప్పాను. ఇన్నాళ్ళకు ఆ పవనపుత్రుని అనుగ్రహం కలిగింది. ఒకనాడు తెల్లవారుఝామున ఆ స్వామి అద్భుత

రూపంలో ప్రకాశిస్తూ ఎంతో ఆనందస్వరూపుడై స్వప్నంలో దర్శనమిచ్చాడు. ఆనాడే ఆ ఆనంద ఆంజనేయం నా మనస్సులో రూపుదిద్దుకుంది. ఈ పుస్తకంలోని ప్రతి అక్షరము ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఇందులో నా గొప్పతనం ఏ మాత్రం లేదు. అంతా ఆ స్వామి అనుగ్రహమే! శ్రీమన్నారాయణులవారి అవతారమైన శ్రీరామచంద్రుని ప్రియభక్తుడు ఆంజనేయులవారు. ఆ స్వామి చిరంజీవియై ఇప్పటికీ తన భక్తులు తనను కానీ, ఆ శ్రీరామచంద్రులవారిని కానీ స్తుతిస్తూ ఉంటారో అక్కడ తప్పక ఉండి తీరుతాడు.

ఆ స్వామి దయవలననే నేను ఈ పుస్తకం రచించటం జరిగింది. ఇదంతా ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకం చదివినవారికి సర్వసౌభాగ్యాలు కలుగుతాయి. ఎటువంటి అనారోగ్యము దరిచేరదు. ఎవరైతే ఆ హనుమంతులవారినే మనస్సులో స్మరిస్తూ ఈ పుస్తకాన్ని చదువుతారో వారికి అన్నింటిలోనూ జయం కలుగుతుంది.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ పుస్తకం చదివిన మీకు, విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీ హనుమంతులవారిని ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

**శ్రీ హనుమత్ కటాక్ష సిద్ధిరస్తు**

**సమస్త సన్మంగాళానిభవంతు ః**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

**హైదరాబాద్.**

**2013**

# ఈ పుస్తకం ఎలా చదవాలి?

హనుమంతులవారు భక్తసులభుడు. ఆ స్వామిని నిత్యం తలచేవారికి ఎటువంటి ఆపదలు కలగవు. తలపెట్టిన అన్ని కార్యాలలోను జయం కలుగుతుంది. ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ఆ స్వామిని స్మరిస్తే మనస్సు ప్రశాంతంగా ఉండి చక్కటి నిద్ర పడుతుంది. ఎటువంటి పీడ కలలు రావు. మరుసటిరోజంతా మనం ఎంతో ఉత్సాహంగా ఉంటాము. ఆ స్వామి అనుగ్రహం పొందడానికి ఈ పుస్తకాన్ని పఠించటం ఎంతో తేలికైన మార్గం. ఈ పుస్తకం చదివేటప్పుడు ఉపవాసము ఉండనవసరము లేదు. శుచిగా స్నానం చేసి, ప్రశాంత మనసుతో ఉంటే చాలు.

- ➩ ఈ పుస్తకాన్ని ఎవరైనా, ఎప్పుడైనా వయసుతోకానీ, కులంతోకానీ, నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష బేధం లేదు. ఈ పుస్తకం ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. ఏకాదశి, పౌర్ణమి తిథులందు మఖ, పూర్వాభాద్ర, స్వాతి నక్షత్రములయందు పఠిస్తే మరింత శుభప్రదం. ఇంట్లో పూజామందిరంలో ఉదయం వేళలో కూర్చుని చదువుకొనవచ్చును. ఈ పుస్తకం చదివిన వెంటనే రెండు అరటిపండ్లు స్వామివారికి నివేదిస్తే చాలా మంచిది. వీలున్నవారు కొబ్బరికాయ కూడా కొట్టవచ్చును.

- ➩ ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ పుస్తకాన్ని వరుసగా మూడు రోజులపాటు స్వామివారి ఆలయంలోకానీ, మరే ఇతర దేవతల ఆలయంలోకానీ ఉదయం కానీ, సాయంవేళలో కానీ కూర్చుని చదివితే ఆ సమస్యలు వెంటనే తొలగిపోతాయి.

➪ పరీక్షలు రాసే విద్యార్థులు ఏ శనివారంనాడైనా స్వామివారి ఆలయంలో కూర్చుని ఈ పుస్తకాన్ని పఠిస్తే ఆ స్వామి అనుగ్రహంతో పరీక్షలు విజయవంతంగా రాయగలుగుతారు.

➪ సంతానం లేనివారు ఏ శనివారంనాడైనా స్వామివారి ఆలయంలోకానీ, మరే ఇతర దేవతల ఆలయాలలో కానీ కూర్చుని వరుసగా మూడు రోజులు చదివితే తప్పక చక్కటి సంతానం కలుగుతుంది. వివాహం కాని కన్యలు కానీ, యువకులు కానీ ఈ విధంగా చదివితే త్వరలో వివాహం నిశ్చయమౌతుంది.

➪ మానసిక సమస్యలతో బాధపడేవారు ఏ శనివారంనాడైనా ఈ పుస్తకం ఇంటివద్దకానీ, స్వామివారి ఆలయంలో కానీ చదివితే వారికి చక్కటి ఆరోగ్యం లభిస్తుంది. అనారోగ్యంతో బాధపడేవారికి వారి బంధువులు కానీ, స్నేహితులు కానీ ఈ పుస్తకం చదివి వినిపిస్తే వారి అనారోగ్యం త్వరలోనే తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యవంతులౌతారు.

➪ శ్రీ హనుమంతులవారి ఆలయంలో ఈ పుస్తకం అక్కడ చేరిన భక్తులకు చదివి వినిపించినవారికి స్వామి అనుగ్రహం లభించి ఎల్లకాలం సుఖసంతోషాలతో జీవిస్తారు. వీలును బట్టి ఉదయం కానీ, సాయంత్రం కానీ చదువవచ్చు. చదవటం పూర్తయిన తరువాత స్వామివారికి అరటిపండ్లు నివేదించి భక్తులందరు కనులకు అద్దుకుని ప్రసాదంగా స్వీకరిస్తే చాలా మంచిది.

➪ దూరదేశాలలో ఉండే మీ పిల్లల నిమిత్తం మీరు కూడా చదువవచ్చును. వారికి సంతానం, వివాహం, ఉద్యోగం కొరకు మీరు ఈ పుస్తకాన్ని శ్రీ హనుమంతులవారి ఆలయంలో కూర్చుని వరుసగా మూడు రోజులు చదివితే వెంటనే ఫలితం కలుగుతుంది.

➪ హనుమంతులవారి ఆలయంలో ఈ పుస్తకాన్ని భక్తులకు చదివి వినిపించేవారికి కోటిజన్మల పుణ్యఫలం లభిస్తుంది. ఆలయ అర్చకులు ప్రతి శనివారం నాడు స్వామి ఎదుట ఈ పుస్తకాన్ని పఠిస్తే వారికి, ఆలయానికి వచ్చే భక్తులకు స్వామి అనుగ్రహం కలిగి జీవితం శుభప్రదంగా గడుస్తుంది.

➪ వివాహం కానీ, గృహప్రవేశం కానీ, నూతన వ్యాపార ఆరంభం కానీ, ఇలా ఏ శుభకార్యాలు తలపెట్టినా ఇంట్లో ఒంటరిగా కానీ, బంధుమిత్రులను పిలుచుకొని కానీ ఈ పుస్తకాన్ని పఠించి, స్వామికి ప్రసాదం నివేదించి స్వీకరిస్తే తలపెట్టిన ఆ కార్యం శుభప్రదంగా గడుస్తుంది. అటు తరువాత తిరిగి మరొకసారి బంధుమిత్రులను అందరిని పిలిచి ఈ పుస్తకం పఠించి స్వామికి ప్రసాదం నివేదించి అందరూ స్వీకరిస్తే చాలా మంచిది.

ఈవిధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా ఈ పుస్తకం పఠించి శ్రీ హనుమంతులవారి అనుగ్రహం పొందవచ్చును.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# శ్రీ ఆంజనేయాష్టోత్తర శతనామావళి

ప్రతి నామమునకు ముందు ‘ఓం’ అనియు చివర ‘నమః’ అనియు పూజించవలెను.

ఆంజనేయాయ
మహావీరాయ
హనుమతే
మారుతాత్మజాయ
తత్వజ్ఞానప్రదాయ
సీతాదేవీముద్రా
ప్రదాయకాయ
అశోకవనికాచ్ఛేత్రే
సర్వమాయా
విభంజనాయ
సర్వబంధవిమోచ్యే
రక్షోవిధ్వంస
కారకాయ
పరవిద్యా
పరీహారాయ
పరశౌర్య
వినాశనాయ
పరమంత్రనిరాకర్త్రే
పరయంత్ర
ప్రభేదకాయ
సర్వగ్రహవినాశినే
భీమసేనసహాయకృతే
సర్వదు:ఖహారాయ
సర్వలోకచారిణే

మనోజవాయ
పారిజాత
ద్రుమూలస్థాయ
సర్వమంత్రస్వరూపవతే
సర్వతంత్రస్వరూపే
సర్వమంత్రాత్మకాయ
కపీశ్వరాయ
మహాకాయాయ
సర్వరోగహరాయ
ప్రభవే
బలసిద్ధికరాయ
సర్వ విద్యా
సంపత్ప్రదాయకాయ
కపిసేనానాయకాయ
భవిష్యచ్చతురాననాయ
కుమార బ్రహ్మచారిణే
రత్నకుండలదీప్తిమతే
సంచలద్వాలసన్నద్ధలంబ
మానశిఖోజ్వలాయ
గంధర్వవిద్యాతత్వజ్ఞాయ
మహాబలపరాక్రమాయ
కారాగృహవిముక్త్రే
శృంఖలాబంధమోచకాయ

సాగరోత్తారకాయ
ప్రాజ్ఞాయ
రామదూతాయ
ప్రతాపవతే
వానరాయ
కేసరీసుతాయ
సీతాశోకనివారణాయ
అంజనాగర్భసంభూతాయ
బాలార్కసదృశాననాయ
విభీషణప్రియకరాయ
దశగ్రీవకులాంతకాయ
లక్ష్మణప్రాణదాత్రే
వజ్రకాయాయ
మహాద్యుతయే
చిరంజీవినే
రామభక్తాయ
దైత్యకార్యవిఘాతకాయ
అక్షహంత్రే
కాలనాభాయ
పంచవక్త్రాయ
మహాతపసే
లంకిణీభంజనాయ
శ్రీమతే

# శ్రీ ఆనంద ఆంజనేయం

సింహికాప్రాణభంజనాయ
గంధమాదనశైలస్థాయ
లంకాపుర విదాహకాయ
సుగ్రీవసచివాయ
ధీరాయ
శూరాయ
దైత్యకులాంతకాయ
సురార్చితాయ
మహాతేజసే
రామచూడామణిప్రదాయ
కామరూపాయ
పింగళాక్షాయ
వార్థిమైనాకపూజితాయ
కబళీకృతమార్తాండ
మండలాయ
విజితేంద్రియాయ
రామసుగ్రీవసంధాత్రే

మహారావణమర్ధనాయ
స్పటికాభాయ
వాగధీశాయ
నవవ్యాకృతిపండితాయ
చతుర్బాహవే
దీనబంధవే
మహాత్మనే
భక్తవత్సలాయ
సంజీవనగాహర్త్రే
శుచయే
వాగ్మినే
దృఢవ్రతాయ
కాలనేమిప్రమథనాయ
హరిమర్కటమర్కటాయ
దాంతాయ
శాంతాయ
ప్రసన్నాత్మనే

శతకంఠమదాపహృతే
యోగినే
రామకథాలోలాయ
సీతాన్వేషణపండితాయ
వజ్రదంష్ట్రాయ
వజ్రనఖాయ
రుద్రవీర్యసముద్భవాయ
ఇంద్రజిత్ప్రహితామోఘ
బ్రహ్మాస్త్రనివారకాయ
పార్థధ్వజాగ్రసంవాసినే
శరపంజరభేదకాయ
దశబాహవే
లోకపూజ్యాయ
జాంబవత్ప్రీతివర్ధనాయ
సీతాసమేత
శ్రీరామపాద
సేవాదురంధరాయ

ఆంజనేయ ఆంజనేయ ఆంజనేయ పాహిమామ్
హనుమంత హనుమంత హనుమంత రక్షమామ్

# ఆంజనేయుని ద్వాదశ నామావళి :

హనుమానంజనాసూనుః। వాయుపుత్రో మహాబలః।

రామేష్టః ఫల్గుణసఖః। పింగాక్షో మితవిక్రమః॥

ఉదధి క్రమణశ్చైవ। సీతాశోకవినాశకః।

లక్ష్మణ ప్రాణదాతాచ। దశగ్రీవస్య దర్పహా॥

ద్వాదశైతాని నామాని కపీంద్రస్య మహాత్మనః।

స్వాపకాలే పఠేన్నిత్యం యాత్రాకాలే విశేషతః।

తస్య మృత్యుభయం నాస్తి। సర్వత్ర విజయీభవేత్॥

# మొదటి అధ్యాయం

## రామశర్మ కథ

శ్రీ హనుమంతుల వారు భక్త సులభుడు. తనను నమ్మి కొలచిన వారిని నిత్యం నీడలా వెన్నంటి కాపాడే అమృతమూర్తి. ఆ స్వామిని తలచుకుంటే మనస్సులో ఎటువంటి భయం ఉన్నా వెంటనే తొలగిపోతుంది. మనస్సు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నప్పుడు శ్రీ హనుమంతులవారిని ఒక్కసారి మనస్సులో స్మరిస్తే చాలు. వెంటనే మనస్సంతా ఎంతో తేలిక పడుతుంది. మహా బలవంతుడు అహంకార రహితుడు, అనురాగశీలుడు అయిన ఆంజనేయుని నిరంతరం మనస్సులో నింపుకునేవారికి వారు తలపెట్టే అన్ని కార్యాలయందు జయం సిద్ధిస్తుంది.

పూర్వకాలంలో వేంకటాపురం అనే గ్రామంలో రామశర్మ అనే బీద బ్రాహ్మణుడు నివసించేవాడు. స్వతహాగా శ్రీరామ భక్తుడైన రామశర్మ నిత్యం ఆ రామచంద్రుల

వారిని స్మరిస్తూ ఆ స్వామికి అత్యంత ప్రీతిపాత్రుడైన హనుమంతులవారిని కూడా నిత్యం పూజిస్తూ ఉండేవాడు. పూర్వజన్మ కర్మఫలితంగా ఎంతో బీదరికం అనుభవిస్తున్నప్పటికీ మంచి నడవడికను కలిగి తన తోటివారందరిలో భగవంతునే చూస్తుండేవాడు. ఊరివారి ఇళ్లలో జరిగే శుభకార్యాలలో పౌరోహిత్యం నిర్వహిస్తూ కాలం గడిపేవాడు. ఆ ఊరిలోనే కాక చుట్టుప్రక్కల గ్రామాలలో కూడా చిన్న చిన్న పౌరోహిత్యపు పనులకు వెళ్ళి వస్తుండేవాడు.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు రామశర్మకు పొరుగూరైన సీతారామపురం నుంచి అక్కడి షావుకారింట్లో మరునాటి ఉదయం గృహప్రవేశం నిర్వహించడానికి రమ్మనమని కబురు వచ్చింది. ఆ ప్రక్క ఊరికి వెళ్ళే దారి అడవి మార్గం గుండా వెళుతుంది. ఆ మార్గం నుంచి రాత్రివేళ ప్రయాణం సాగించడం అంత శ్రేయస్కరం కాదు. అడవిలో రాత్రివేళల్లో క్రూర మృగాల బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకని రామశర్మ ఈ రోజు మధ్యాహ్నమే బయలుదేరి సాయంత్రానికి సీతారామపురం చేరుకోవాలని నిశ్చయించాడు. సాయంత్రానికి ఆ ఊరు చేరితే తెల్లవారుఝామున గృహప్రవేశ కార్యక్రమం పూర్తి చేసుకుని తిరిగి సాయంత్రం వేళకు ఇంటికి చేరవచ్చునని తలచాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకల్లా భోజనం చేసి ఇక బయలుదేరడానికి సిద్ధమవుతుండగా వెంకటాపురం జమిందారు నుంచి రామశర్మకు ఏదో ముహూర్త విషయమై మాట్లాడాలని కబురు వచ్చింది. ఇప్పుడు తాను వారింటికి వెళితే సీతారామపురం వెళ్ళడానికి ఆలస్యం అవుతుంది. అలాగని వెళ్ళకపోతే జమిందారుకు కోపం రావచ్చు. జమిందారు కోపానికి గురైతే ఈ ఊరిలో దొరుకుతున్న చిన్న చిన్న పౌరోహిత్యపు పనులు కూడా లభించటం గగనం అవుతుంది. రామశర్మ ఇలా తలచి అన్నీ ఆ రామచంద్రప్రభువుపైనే భారం వేసి జమిందారుని కలవడానికి బయలుదేరాడు. తీరా ఇంటికి వెళ్ళేటప్పటికి జమిందారు ఏదో అర్జంటు పనిమీద బయటకు వెళ్ళాడని తాను వస్తే రామశర్మను ఉండమని చెప్పారని నౌకర్లు చెప్పారు. ఈ మాటలు విన్న రామశర్మకు కంగారు ఎక్కువైంది. అసలీ జమిందారు ఎప్పటికి వస్తాడో తాను సీతారామపురం ఎప్పటికి చేరతానో అని బాధపడ్డాడు.

సాయంత్రం నాలుగు గంటల వేళ జమిందారు ఇంటికి చేరాడు. వచ్చిన తరువాత ఇంటిలోనికి వెళ్ళి ఒక గంటకు బయటకు వచ్చాడు. రామశర్మతో తన కుమార్తెకు వివాహం చేయాలని తలచానని ఒక్కసారి జాతక పరిశీలన చేయవలసిందని అన్నాడు. అమ్మాయి జాతకాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన రామశర్మ త్వరలోనే వివాహం అవుతుందని అన్నాడు. ఇదంతా అయ్యేటప్పటికి సాయంత్రం అయింది. రామశర్మ జమిందారు వద్ద శెలవు తీసుకుని ఉరుకులు, పరుగుల మీద ఇంటికి చేరాడు. భార్య రామశర్మతో ఇంక చీకటివేళ అయింది. ఇక ఇప్పుడు సీతారామపురం ఏమి వెళ్తారు అని అన్నది. కానీ రామశర్మకు ఆ వచ్చే నాలుగు రూపాయలు పోగొట్టుకొనడానికి ఇష్టంలేక తాను తప్పక వెళతానని అన్నింటికి ఆ రామచంద్రుడే ఉన్నాడని భార్యతో చెప్పి బయలుదేరాడు. ఇక చేసేదిలేక భార్య రామశర్మకు ఎన్నో జాగ్రత్తలు చెప్పి పంపించింది.

రామశర్మ శ్రీరామచంద్రుని తలుస్తూ భుజంపై సంచిలో గృహప్రవేశానికి కావలసిన సామాన్లు సర్దుకుని బయలుదేరి కొంతసేపటికి అడవిదారిలో ప్రవేశించాడు. అంతా చీకటిగా ఉంది. త్రోవ కూడా సరిగా కనపడటం లేదు. ఎక్కడో గుడ్లగూబ భయంకరంగా అరిచింది. రామశర్మకు కొద్దిగా భయం పట్టుకుంది. వెంటనే ఆ హనుమంతులవారు మదిలో మెదిలారు. ఎటువంటి ఆపదలోనైనా ఆదుకునే స్వామి ఆంజనేయుడు. ఆ స్వామి నామాన్నే గట్టిగా ఉచ్ఛరిస్తూ నడవసాగాడు. కంటికి కొంచెం దూరంలో ఒక నాగుపాము త్రోవకు అడ్డంగా పడగవిప్పి బుస కొడుతోంది. రామశర్మ ఉన్నచోటనే నించొని హనుమంతులవారిని స్తుతిస్తూ ఆ పాముకు నమస్కరించాడు. అంతే ఆ పాము నెమ్మదిగా పడగ దించి పక్కన ఉన్న పొదలలోనికి వెళ్ళిపోయింది.

రామశర్మ తిరిగి తన నడక ప్రారంభించాడు. మరొక పదినిమిషాలకు మించి అడవిదారి లేదనగా ఒక్కసారి ఎక్కడినుంచో ఒక చిరుత పులి గట్టిగా గాండ్రిస్తూ రామశర్మ ముందు దూకింది. హటాత్తుగా జరిగిన ఈ పరిణామానికి రామశర్మ హతాశుడయ్యాడు. తనవంకే గుర్రుగా చూస్తూ ఏ క్షణంలోనైనా మీదకు దూకడానికి

సిద్ధంగా ఉన్న ఆ చిరుత పులిని చూసేటప్పటికి రామశర్మ పై ప్రాణాలు పైనే పోయాయి. వెంటనే హనుమంతులవారిని ఇలా ప్రార్థించాడు. ఓ ఆంజనేయా! పవనపుత్రా! శ్రీరామదూతా! నీవు తప్ప అన్యధా శరణం నాస్తి. లంకలో అనేక రాక్షసులను సంహరించిన వాడవు, ఆ సీతమ్మతల్లి జాడను కనుక్కున్నవాడవు. నన్ను ఈ ఆపదనుండి రక్షింపు తండ్రీ! అని ప్రార్థించాడు. రామశర్మ విన్నపాలు విని భక్తవత్సలుడైన హనుమంతులవారు కరుణించారు. అంతే ఒక్క క్షణంలో ప్రక్కన చెట్లపైనుంచి పెద్దగా అరుస్తూ ఒక వానరం భయంకర శబ్ధం చేస్తూ చిరుతపులిపై దూకింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి చిరుతపులి బెదిరి వెంటనే తేరుకుని ఆ వానరంమీదకు దూకింది. ఎంతో తేజస్సుతో మెరిసిపోతున్న ఆ వానరం సామాన్య వానరంలా లేదు. అత్యంత భీకరంగా అరుస్తూ చిరుత వీపుపై తన పదునైన గోళ్ళతో రక్కసాగింది. ఇక తట్టుకోలేక చిరుత ఆ వానరాన్ని తప్పించుకుని అడవిలోకి పరిగెత్తి పారిపోయింది. ఇది జరిగిన వెంటనే ఆ దివ్య వానరం కూడా పక్కన ఉన్న చెట్టుపైకి దూకి ఒక్క మెరుపు మెరుస్తూ అదృశ్యమైంది.

జరిగిన సంగతి రామశర్మకు అర్థమైంది. స్వామియే ఇలా వచ్చి తనను రక్షించాడని గ్రహించి హనుమంతులవారిని ఎన్నో విధాల స్తుతించాడు. ఇంక ధైర్యం తెచ్చుకుని ముందుకు సాగి ఆ ఊరు చేరి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వర్తించి వెంటనే బయలుదేరి సాయంకాలానికి తన ఇంటికి చేరాడు. జరిగినదంతా భార్యకు చెప్పాడు. భార్యాభర్తలిద్దరూ హనుమంతులవారిని ఎన్నో విధాల స్తుతించారు.

శ్రీరామ భక్తుడైన ఆంజనేయుని స్తుతించినవారికి సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి. ఎంతటి అనారోగ్యమైనా తొలగిపోతుంది. ఆ స్వామి అత్యంత బలసంపన్నుడు. భక్త వత్సలుడు. ఆ స్వామి పేరు ఒక్కసారి తలిస్తేనే ఎంతటి భూత పిశాచాలు కూడా దరి చేరవు. హనుమంతులవారిని నిత్యం స్మరించేవారికి ఎటువంటి ఆపదా కలుగదు. సర్వాభీష్ట ప్రదాతయైన శ్రీ ఆంజనేయుని కొలిచినవారికి అన్నింటా జయం కలుగుతుంది.

# రెండవ అధ్యాయం

## విష్ణుభట్టు కథ

పూర్వకాలంలో కళింగదేశంలో కృష్ణాపురం అనే చిన్న గ్రామం ఉండేది. ఆ గ్రామంలో విష్ణుభట్టు అనే బీద బ్రాహ్మణుడు నివసిస్తుండేవాడు. అతడు తనకు వచ్చిన చిన్నపాటి విద్యతో ఆ ఊరిలో పౌరోహిత్యం నిర్వహిస్తుండేవాడు. పుట్టుకతో అవిటివాడైన విష్ణుభట్టుకు ఆ వచ్చిన సొమ్ముతో ఇల్లు గడవటం కష్టతరంగా ఉండేది. తన బీదరికానికి ఎల్లప్పుడూ బాధ పడుతుండేవాడు. తనను ఈ కష్టాలనుంచి బయట పడేయమని భగవంతుని ప్రార్థిస్తూ ఉండేవాడు. ఆ ఊరిలో శ్రీ అభయ ఆంజనేయస్వామివారి దేవాలయం ఉంది. ఆ దేవాలయం ఎంతో పురాతనమై అక్కడి స్వామి ఎంతో మహిమ గలవానిగా ఇరుగుపొరుగు గ్రామాలలో ప్రసిద్ధి పొందాడు. ప్రతి సంవత్సరం ఆ దేవాలయంలో ఎన్నో ఉత్సవాలు జరిగేవి. ఉత్సవ సమయాలలో జనం తండోపతండాలుగా వచ్చేవారు. పొరుగు ఊళ్ళనుంచి బళ్ళు

కట్టుకుని పిల్లా పాపలతో కలిసి వచ్చేవారు. ఉత్సవం జరిగినన్ని రోజులు ఊరంతా పండగ వాతావరణం నెలకొనేది. శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయాన్ని రకరకాల పుష్పాలతో ఎంతో అద్భుతంగా అలంకరించేవారు.

ప్రతీ సంవత్సరం లాగానే ఆ ఏడు కూడా ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు శ్రీ హనుమంతులవారికి ఎన్నో ప్రత్యేక పూజలు నిర్వర్తిస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఆలయప్రాంగణంలో భక్తబృందాలచే భజనలు జరుగుతున్నాయి. ప్రతిరోజు ఎంతో పేరున్న భాగవతార్లు రాత్రి పదిగంటలకు మొదలుపెట్టి తెల్లవారేదాకా హరికథలు చెపుతున్నారు. భక్తులందరూ స్వామివారి మహిమలు వింటూ ఎంతో ఆనందపడుతున్నారు. ఆ రోజు మంగళవారం. స్వామివారిని ఎంతో అద్భుతమైన సింధూరంతో అలంకరించారు. ఎంతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ స్వామి రూపాన్ని దర్శించి భక్తులందరూ తన్మయులౌతున్నారు. హనుమంతులవారికి భక్తులంటే ఎంతో వాత్సల్యం. ఎటువంటి కష్టాలలో ఉన్నా ఆ స్వామిని తలిస్తే ఆ కష్టం క్షణంలో తొలగిపోతుంది. తలపెట్టిన ఏ కార్యమైనా విజయవంతంగా జరగాలంటే హనుమంతులవారిని ఆరాధిస్తే ఆ పని చక్కగా, నిర్విఘ్నంగా జరుగుతుంది. ఎంతటి అనారోగ్యవంతులైనా ఆ స్వామిని నిత్యం ఆరాధిస్తే త్వరలోనే రోగవిముక్తులౌతారు.

విష్ణుభట్టు కూడా రోజూ జరిగే ఈ కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు. ఈ సంవత్సరమైనా తన కష్టాలు తొలగిపోతే బాగుండునని ఆ స్వామిని ప్రార్థించాడు. పుట్టుకతోఉన్న అవిటితనంతోపాటు విష్ణుభట్టుకు ఈ మధ్యనే ఒక చర్మవ్యాధి కూడా పట్టుకుని ఎన్ని వైద్యాలు చేసినా ఏ మాత్రం తగ్గటం లేదు. పూట గడవటం కష్టంగా ఉంటున్నది. ఎన్నో రకాల మూలికావైద్యం చేయించుకుంటున్నప్పటికి ఏమాత్రం ఉపశమనం కలగటం లేదు. విష్ణుబట్టు ఇదంతా తన పూర్వజన్మ కర్మఫలంగా భావించాడు.

ఒక రోజు సాయంత్రం ఆలయంలో అతడికి పొరుగూరినుంచి ఈ ఉత్సవాల నిమిత్తం వచ్చిన ఒక పండితుడు కనపడ్డాడు. విష్ణుభట్టు అతనికి నమస్కరించి తన

కష్టాలను చెప్పుకున్నాడు. ఈ కష్టాలనుంచి బయటపడే ఉపాయం ఏదైనా చెప్పమని ప్రాధేయపడ్డాడు. అప్పుడు ఆ పండితుడు విష్ణుభట్టుతో ఇలా అన్నాడు. నాయనా! నీ బాధ నేను గ్రహించాను. ఎంతటివారికైనా పూర్వజన్మ కర్మఫలం అనుభవింపక తప్పదు కదా. నీవు మునుపటి జన్మలో ఈ ఊరికి నలభైమైళ్ళ దూరంలో గల అచ్యుతాపురంలోని ఆంజనేయస్వామివారి దేవాలయంలో పూజారివి. అయితే ఆ జన్మలో ఎన్నో పాపకార్యాలు చేశావు. స్వామి ఆలయ పూజారిగా ఉంటూ ఏ మాత్రం నియమ నిష్టలు ఆచరించకుండా పరస్త్రీ వ్యామోహం, చోరతనం వంటి దురలవాట్లకు లోనయ్యావు. అలా చేసిన పాపకార్యాల ఫలంగా ఈ జన్మలో ఇన్ని కష్టాలు అనుభవిస్తున్నావు. వీటికి ఒకే ఒక పరిహారం ఉన్నది. వరుసగా ఏడు శనివారాలు ఉదయాన్నే శుచిగా స్నానం చేసి, నియమ నిష్టలతో పూర్తి ఉపవాసంతో ఉంటూ ఈ ఆలయాన్ని శుభ్రపరచి రోజంతా ఆ స్వామినే తలుస్తూ ఆలయం శుభ్రంగా ఉండేలా చూడు. ఈ విధంగా ఏడు శనివారాలు ఆ స్వామి సేవ చేస్తే నీ పూర్వజన్మ పాపం తొలగిపోయి నీకు శుభం కలుగుతుంది అని చెప్పాడు. విష్ణుభట్టు ఆ పండితునికి నమస్కరించి తప్పక ఆ విధంగానే చేస్తానని అన్నాడు.

విష్ణుభట్టు ఆ పండితుడు చెప్పినట్లు చేయడానికి నిశ్చయించుకుని ఆ వారంలో వచ్చిన శనివారంతోనే మొదలుపెట్టాడు. ఉదయాన్నే స్నానం చేసి హనుమంతులవారి ఆలయానికి వెళ్ళి అక్కడ చీపురు తీసుకుని ఆలయమంతా శుభ్రం చేశాడు. అవిటితనం వలన శరీరం కొంచెం శ్రమగా అనిపించింది. అయినా పట్టుదలగా రాత్రిదాకా ఆలయంలోనే ఉండి రాత్రి స్వామి వారి ప్రసాదం తీసుకుని ఇంటికి వెళ్ళాడు. ఇలా ఆరు వారాల పాటు నియమనిష్టలతో ఆ పండితుడు చెప్పినట్లే స్వామి సేవ చేశాడు.

ఇలా ఆరువారాలు గడిచాయి. ఏడో శనివారం వచ్చింది. ఉదయాన్నే స్నానం చేసి శుభ్రమైన ధోవతి కట్టుకుని ఆలయానికి వచ్చాడు. అంతకుముందు రాత్రి పెద్దగాలివాన రావటంతో ఆలయమంతా రాలిన చెట్ల ఆకులతో, ఎంతో దుమ్ముతో నిండి ఉంది. ఆలయమంతా శుభ్రం చేసేటప్పటికి మధ్యాహ్నం రెండు

గంటలయ్యింది. ఎంతో శ్రమగా అనిపించి విష్ణుభట్టు ఆలయమండపంలో స్తంభానికి ఆనుకుని కూర్చున్నాడు. నీరసంగా ఉండటం వలన కొద్దిగా కునుకు పట్టింది. నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు. ఆ నిద్రలో విష్ణుభట్టుకి ఒక కల వచ్చింది. ఆ కలలో ఎంతో దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న హనుమంతులవారు దర్శనమిచ్చారు. కలలో స్వామి వజ్ర వైఢూర్యాలతో మెరిసిపోతున్న కిరీటం ధరించి ఉన్నాడు. మెడలో ఎంతో ప్రకాశిస్తున్న కంఠాభరణం అద్భుతమైన పూలమాల ... చెవులకు దివ్యమైన సువర్ణ కర్ణాభరణాలు... చేతులకు, కాళ్ళకు బంగారు కడియాలు... ఆ స్వామి ఎన్నో దివ్యాభరణాలతో , దివ్య మందహాసంతో కనులలో కరుణరసంతో విష్ణుభట్టుకి దివ్యదర్శనాన్ని ప్రసాదించాడు.

విష్ణుభట్టు ఆ స్వామికి నమస్కరించి ఎన్నోవిధాల స్తుతించాడు. ఆ స్వామి అనుగ్రహించిన అద్భుత దర్శనానికి ఆనందపడుతుండగా ఒక్కసారిగా మెలకువ వచ్చింది. కనులు తెరిచి కలలో అంతటి దివ్యదర్శనం జరిగినందుకు సంతోష పడుతుండగా ఎక్కడి నుంచి వచ్చిందో ఒక వానరం పక్కన ఉన్న చెట్టుపైనుంచి కిందకు దూకి, విష్ణుభట్టు వద్దకు వడివడిగా వచ్చి తన చేతితో విష్ణుభట్టు వీపుపై ఒక్కసారిగా చరిచి అదేవేగంతో వెనుకకు పరిగెత్తి చెట్టుమీదకు దూకి క్షణంలో మాయమైంది. ఒక్కసారిగా జరిగిన ఈపరిణామానికి విష్ణుభట్టు నివ్వెరపోయాడు. ఒళ్ళంతా జలదరించింది. ఈ వానరం ఏమిటి, తన వద్దకు రావటం ఏమిటి అని తలుస్తుండగా ఒక అద్భుతం గమనించాడు. తన అవిటితనం పూర్తిగా మాయమైంది. అంతేకాదు విష్ణుశర్మ చర్మవ్యాధి క్షణంలో మాయమైంది. శరీరమంతా ఎంతో శక్తి వచ్చినట్లు అనిపించింది. ఇదంతా ఆ హనుమంతులవారి అనుగ్రహంగా గమనించాడు. వచ్చినది సాక్షాత్తూ తనకు కలలో కనపడిన ఆనంద ఆంజనేయునిగా గ్రహించాడు. ఆహా! ఆంజనేయా ఆనంద స్వరూపా, భక్తవత్సలా ఇన్నాళ్ళకు నన్ను అనుగ్రహించావా తండ్రీ. నీకివే నా నమస్కారములు. ఓ కరుణామూర్తీ! ఓ పవనపుత్రా! నీకివే నా ప్రణామములు. ఓ భక్తాధీనా! ఓ ఆశ్రితజన రక్షకా! నీకివే నా నమస్కారాలు అని ఎన్నోవిధాల ఆస్వామిని కొనియాడాడు. ఆవిధంగా విష్ణుభట్టు పూర్తి ఆరోగ్యం లభించినవాడై ఆ తరువాతికాలంలో గొప్ప పురోహితునిగా ఎంతో

పేరు ప్రఖ్యాతులు గడించి ఎంతో ధనం సంపాదించాడు. విష్ణుభట్టు కుటుంబం అంతా శ్రీ ఆంజనేయులవారినే సేవిస్తూ జీవించినంత కాలం సుఖసంతోషాలతో ఆనందంగా జీవించారు.

హనుమంతులవారు భక్తసులభుడు. తనను నమ్మినవారిని ఎటువంటి కష్టాలనుంచైనా బయట పడవేసే భక్తవత్సలుడు. ఏ భక్తుడు తనను నిష్కల్మషమైన భక్తితో ఆరాధిస్తాడో అతనిని తన దివ్య దర్శనంతో ఆనందంలో ముంచెత్తుతాడు. తనను నిర్మల మనస్సుతో కొలచినవారిని ఎల్లవేళలా కాపాడుతూ ఉంటాడు. ఆ స్వామినే నిత్యం స్మరించేవారికి ఎటువంటి ఆపదలూ కలుగవు. సర్వకార్యాలయందు జయం కలుగుతుంది.

# మూడవ అధ్యాయం

## సుబ్బిశెట్టి కథ

ఆంజనేయుడు చిరంజీవి. అత్యంత పరాక్రముడు, మహాశక్తిసంపన్నుడు అయిన హనుమంతులవారు నేటికీ ఉన్నారు. తనను నమ్మి కొలచిన భక్తులను మారుతి సదా కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. ఆ స్వామిని తలచుకున్న తక్షణమే ఏదో ఒక రూపంలో మన దగ్గరకు వచ్చి మనకు ఎంతో ధైర్యాన్ని ప్రసాదిస్తాడు. ఏ పక్షి రూపంలోనో మన సమీపంలోనికి వచ్చి మన భయాన్ని పోగొడతాడు. మనసారా ఆ స్వామిని స్మరిస్తే చాలు. వెంటనే వచ్చి మనల్ని ఆదుకుంటాడు.

పూర్వకాలంలో ఆంధ్రదేశంలో ధర్మాపురం అనే ఊరు ఉండేది. ఆ ఊరిలో సుబ్బిశెట్టి అనే వర్తకుడు ఉండేవాడు. చిన్న చిన్న వ్యాపారాలతో మొదలుపెట్టి కాలం కలసి రావటంతో త్వరితకాలంలోనే చాలా స్థితిమంతుడయ్యాడు. వ్యాపారాన్ని ఎంతగానో విస్తరించాడు. పైకి ఎంతో దైవభక్తి కలవాడులా కనపడుతున్నప్పటికీ లోపల ఎంతో పిసినారి తనం ఉండేది. తన దగ్గర పనిచేసేవారిని సక్రమంగా చూసేవాడు కాదు. ఏదైనా భగవత్ కార్యానికి నూరు రూపాయలు దానం చేయవలసి వస్తే దానికి పదిరెట్లు లాభం వచ్చేవరకు ఎంత బీదవాడికైనా పదిపైసలు కూడా ఇచ్చేవాడు కాదు.

ఆ ఊరిలో ఎంతో అద్భుతమైన ఆంజనేయస్వామి వారి ఆలయం ఉండేది. సుబ్బిశెట్టి ప్రతినెలా ఆలయానికి వెళుతూ ఉండేవాడు. నాలుగు అణాలతో అర్చన చేయించి ఇంటికి సరిపడా నైవేద్యం పొట్లం కట్టించుకునే తీసుకునివెళ్ళేవాడు. ఆ రోజు శనివారం హనుమంతులవారికి దివ్యంగా నిత్యపూజలు జరుగుతున్నాయి. ఎందరో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని వెళుతున్నారు. ఇంతలో సుబ్బిశెట్టికూడా వచ్చాడు. ప్రతిసారి లాగానే నాలుగు అణాలు ఇచ్చి అర్చకుణ్ణి గట్టిగా అడిగి పెద్ద పొట్లం నిండా ప్రసాదం తీసుకుని, తన ఎడ్లబండినెక్కి ఇంటిదారి పట్టాడు. కొంతదూరం వెళ్ళేటప్పటికి ఆ ఊరి జమీందారు బండి ఎదురు వచ్చింది. సుబ్బిశెట్టి వెంటనే బండి దిగి జమీందారుకు నమస్కరించి కుశలప్రశ్నలు వేశాడు. అప్పుడు జమీందారు సుబ్బిశెట్టితో తనకు ఇక్కడినుంచి నలభైమైళ్ళ దూరంలో ఉన్న రామాపురం షావుకారునుంచి కబురు వచ్చిందని వారం రోజులలో నూరు కిలోల కందిపప్పు కావాలని చెప్పాడని, అది సుబ్బిశెట్టి సమకూర్చగలడేమో అడుగుదామని తానే వద్దామనుకున్నానని జమీందారు అన్నాడు. ఈ మాట విన్న సుబ్బిశెట్టి నోట మాట రాలేదు. ఆనందంతో పొంగిపోయాడు. నూరు కిలోలు అంటే ఎంత లాభం? ఎంత మంచి బేరం దొరికింది? అని తలచి తప్పక తాను వారంలోనే ఆ ఊరికి పంపిస్తానని జమీందారుకు చెప్పాడు. జమీందారు తిరిగి బండి ఎక్కి తన దారిన తాను వెళ్ళాడు. సుబ్బిశెట్టి కూడా తన బండి ఎక్కి ఇంటిముఖం పట్టాడు.

బండిలో కూర్చున్న సుబ్బిశెట్టి ఆనందం పట్టలేకుండా ఉన్నాడు. నూరు కిలోల కందిపప్పు అంటే సామాన్యమా? ఎంత లాభం సంపాదించవచ్చు? అని తలుస్తూ సంతోషపడ్డాడు. ఇంతలో తన ఇల్లు వచ్చింది. బ్రహ్మాండమైన బేరం వచ్చిందన్న సంతోషంతో హనుమంతుల వారి ప్రసాదం సంగతి మరిచిపోయాడు. ఇంట్లోకి వెళ్ళగానే ఎంతో హడావుడి చేస్తూ భార్యతో ఈ కందిపప్పు గురించి చెప్పాడు. భోజనం చేసి పడుకున్నాడే కానీ ధ్యాసంతా కందిపప్పుమీదే. ఎంత లాభం వేసుకుని అమ్మాలి. కొంచెం తక్కువ రకం పప్పు పంపిస్తే మరింత లాభం సంపాదించవచ్చు కదా! అని ఇలా ఆలోచిస్తూ నిద్రపోయాడు. ప్రసాదం సంగతి అతనికి గుర్తు రాలేదు. ఇంతలో తెల్లవారింది. ఉదయం స్నానం చేసి రాగానే సుబ్బిశెట్టికి

ఎదురుగా గోడపై ఉన్న హనుమంతులవారి ఫోటో కనపడింది. ఒక్కసారిగా సుబ్బిశెట్టికి స్వామి ప్రసాదం గుర్తుకు వచ్చింది. ఇంటి బయటకు వచ్చి బండి వద్దకు వెళ్ళి లోపలకు చూశాడు. ప్రసాదం అంతా చీమలు తినేశాయి. కొంచెం కూడా మిగలలేదు. అయ్యో అనుకుని ఇంట్లోకి వెళ్ళాడు.

శ్రీ స్వామివారి ప్రసాదాన్ని నిర్లక్ష్యం చేసినందుకు స్వామికి ఆగ్రహం కలిగింది. ఎటువంటి పరిస్థితులలోను ఏ దేవతా ప్రసాదాలను ఎవ్వరూ నిర్లక్ష్యం చేయకూడదు. దేవతలకు నివేదించిన ప్రసాదానికి అత్యద్భుతమైన శక్తి ఉంటుంది. ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తే మనకు ఎంతో ఆరోగ్యం కలుగుతుంది. ఎటువంటి రోగమైనా క్షణంలో నయమవుతుంది. హనుమంతులవారి ప్రసాదాన్ని నిర్లక్ష్యం చేయడంతో స్వామికి సుబ్బిశెట్టిపై ఆగ్రహం కలిగింది. ధనంపై ఉన్న మమకారంతో ప్రసాదాన్ని కూడా నిర్లక్ష్యం చేశాడని స్వామివారికి కోపం కలిగింది. అంతటి పాపం చేసిన సుబ్బిశెట్టికి ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకున్నాడు. ఆ తరువాత నాలుగు రోజులకి సుబ్బిశెట్టి నూరు కిలోల కందిపప్పు మూటను ఇచ్చి గుమస్తాలతో బండికెక్కించి రామాపురం పంపాడు. ఆ బండి ఊరు దాటి కొంతదూరం వెళ్లగానే ఎక్కడినుంచి వచ్చిందో కానీ ఒక పెద్ద వానరదండు వచ్చి ఆ బండిపై దూకింది. బండివాడు భయపడి ఒక్కసారి బండి దిగి పరిగెత్తాడు. ఆ కోతులు గుమస్తాపై కూడా దూకడంతో అతడు కూడా దిగి దూరంగా పరిగెత్తాడు. కోతులన్నీ కందిపప్పు బస్తాలను చింపి వాటిని నేలపై పడేసి చిందర వందర చేసి కందిపప్పునంతా గుప్పిళ్ళలో తీసుకుని ఇష్టం వచ్చినట్టు అటూ ఇటూ పొదల్లోకి విసిరేశాయి. జరిగినసంగతి తెలుసుకుని సుబ్బిశెట్టి ఎంతో బాధపడ్డాడు. ఎంత ధనం వృధా అయిందో తలచాడు. అటు తరువాత సుబ్బిశెట్టి వ్యాపారం కూడా దెబ్బ తిని దీర్ఘ రోగంతో మంచం పట్టి కొన్ని రోజులకు మరణించాడు.

హనుమంతులవారి ప్రసాదాన్ని నిర్లక్ష్యం చేసిన పాపానికి సుబ్బిశెట్టి మరుజన్మలో గాడిదగా జన్మించాడు. యజమాని వీపుమీద వేసే బరువును మోస్తూ దుర్భరమైన జీవితం గడిపాడు. వీపు ఒరుసుకుని పుండ్లు పడి సతమతమవుతున్నా కూడా యజమాని నిర్దాక్షిణ్యంగా మరింత బరువును వేసి మోయించేవాడు. ఇలా

కొంతకాలం ఎంతో దుర్భర జీవితం గడిపి ఒకనాడు మరణించాడు. సుబ్బిశెట్టి మరుజన్మలో ఎలుకలాగా జన్మించాడు. భగవంతుని ఎడల చేసే ఏ పాపమైనా జన్మ జన్మలు బాధిస్తుంది. అంత త్వరగా వదిలిపోదు. అందునా హనుమంతులవారి ఆగ్రహానికి పాత్రులైనవారు మరింతగా శిక్షను అనుభవిస్తారు.

ఎలుకరూపంలో జన్మించిన సుబ్బిశెట్టి గోదాములలోను, పంట చేలలోను పరిగెడుతూ కాలం వెళ్ళబుచ్చుతూ చివరికి ఒకనాడు ఒక పిల్లి కంట పడి ఘోరంగా చంపపడ్డాడు. ఆ తరువాత జన్మలో సుబ్బిశెట్టి చిలక రూపంలో జన్మించాడు. ఆ చిలుక ఆ చెట్టు, ఈ చెట్టుపై ఎగురుతూ ఒకనాడు ధర్మాపురం ఆంజనేయస్వామి గుడికి చేరుకుంది. ఆ గుడి ఆవరణలో ఉన్న చెట్టుపై వాలగానే చిలుకకు తన పూర్వజన్మ వృత్తాంతం గుర్తుకు వచ్చింది. స్వామి ప్రసాదం నిర్లక్ష్యం చేయడంవలననే ఇన్ని కష్టాలు పడవలసి వచ్చిందని గ్రహించింది. తన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని తలచింది. ఆ చెట్టుపైనే ఉంటూ భక్తులు తిని పడవేసిన ఎంగిలి దొప్పలలో ఉన్న మెతుకులను తింటూ కాలం గడపసాగాడు. రోజూ ఆవరణలో ఇటూ అటూ ఎగురుతూ నేలపై ఎక్కడ చిన్న ప్రసాదం ముక్కైనా, మెతుకైనా కనపడితే దానిని ముక్కున కరుచుకుని చెట్టుపైకి ఎక్కి అదే మహాభాగ్యంగా చిలకరూపంలో జన్మించిన సుబ్బిశెట్టి తినేవాడు. ఈవిధంగా సంవత్సర కాలం గడిపి ఒకనాడు పెద్దగాలి వానికి తట్టుకోలేక మరణించాడు. రోజూ ఇలా స్వామి వారి ప్రసాదం తిన్న పుణ్యంచేత తిరిగి మానవజన్మనెత్తి అదేఊరిలో అర్చకుని కుటుంబంలో జన్మించి శ్రీ ఆంజనేయులవారిని నిత్యం సేవిస్తూ ధర్మపథంలో జీవించాడు. ఎంతో మంచి అర్చకునిగాను, స్వామివారి ప్రియభక్తుడిగాను పేరు సంపాదించి జీవించినంత కాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందాడు.

శ్రీ ఆంజనేయస్వామివారి ప్రసాదానికున్న మహత్యం అంతటిది. ఆ స్వామికి నివేదించిన ఏ పదార్థమైన అమృతతుల్యమౌతుంది. కళ్ళకు అద్దుకుని స్వీకరించినవారికి సర్వరోగాలూ నశిస్తాయి. నూతనోత్తేజం కలుగుతుంది. ఎటువంటి ఆపదలూ కలుగవు. తలపెట్టిన అన్ని కార్యాలయందు జయం కలుగుతుంది.

# నాలగవ అధ్యాయం

## శ్రీ ఆనంద ఆంజనేయ దివ్య కథ

పూర్వకాలంలో కళింగదేశంలోని రామాపురంలో ఎంతో అద్భుతమైన రామాలయం ఉండేది. అక్కడ వెలసిన శ్రీ సీతారామచంద్రులవారి విగ్రహాలు ఎంతో అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తూ ఉండేవి. వారి పాదాల చెంతనే ఆంజనేయుని విగ్రహం ఎంతో చూడముచ్చటగా ఉండేది. ప్రతి ఏటా జరిగే శ్రీరామనవమి ఉత్సవాలలో స్వామివారి మూలమూర్తులను ఎంతో అద్భుతంగా అలంకరించేవారు. ప్రతిరోజూ హరికథా కాలక్షేపాలు జరిగేవి. చుట్టుప్రక్కల ఊర్లనుంచి ఎందరో భక్తులు ఎడ్లబళ్ళు కట్టుకుని రామాపురం వచ్చేవారు. ఆ పదిరోజులు ఊరంతా ఎంతో కోలాహలంగా ఉండేది. ఊరి వారందరిళ్ళు దూర గ్రామాలనుంచి వచ్చిన బంధువులతో కళకళలాడుతుండేవి.

ప్రతిసంవత్సరం లాగానే ఆ ఏడు కూడా శ్రీరామనవమి ఉత్సవాలు ఎంతో అద్భుతంగా మొదలైనాయి. ఒకనాడు సాయంత్రం ఆలయ ఆవరణలో ఉన్న

మండపంలో పక్కన ఊరినుంచి వచ్చిన విష్ణుశర్మ అనే పండితుడు రామాయణ కథను వివరిస్తూ మధ్యలో శ్రీ ఆంజనేయులవారి గురించి ఇలా చెప్పుతున్నాడు. నాయనలారా శ్రీ ఆంజనేయుల స్వామివారు మహా శక్తిసంపన్నుడు. మహా ధైర్యశాలి. సకల విద్యా పారంగతుడు. ఆ స్వామికి తెలియని విద్య లేదు. తెలియటమే కాదు, ఆ స్వామి అన్ని విద్యలలోను తిరుగులేని ప్రావీణ్యం కలవాడు. గొప్ప వ్యాకరణ పండితుడు. శత యోజనాల సముద్రాన్ని అవలీలగా దాటిన మహా బలశాలి హనుమంతుడు. ఆ స్వామి చిరంజీవియై నేటికీ మన మధ్య ఉన్నాడు. ఆ స్వామిని నమ్మి కొలిచినవారికి ఎటువంటి ఆపదలూ దరి చేరవు. ఎటువంటి అనారోగ్యమైనా శీఘ్రంగా తొలగిపోతుంది. స్వామివారి జన్మ నక్షత్రం కొన్ని గ్రంధాలలో పూర్వాభాద్రగాను, మరికొన్ని గ్రంథాలలో స్వాతిగాను చెప్పబడినవి. ఆ స్వామికి అరటిపండ్లు, మామిడిపండ్లు ఎంతో ప్రీతికరమైనవి. ఆ పండ్లను స్వామివారికి నివేదిస్తే స్వామి ఎంతో సంతోషిస్తాడు. హనుమంతులవారికి సింధూరం ఎంతో ప్రీతికరమైనది. శ్రీ స్వామివారికి మంగళ, శనివారాలు ఎంతో ప్రీతికరమైనవి. ఈ వారాలలో హనుమంతులవారి ఆరాధన ఎంతో శ్రేయస్కరం అని విష్ణుశర్మ శ్రీ హనుమంతులవారి వైభవాన్ని ఎంతో చక్కగా వివరించాడు.

విష్ణుశర్మ మారుతి విశేష మహిమలను ఇంకా ఇలా చెప్పసాగాడు. హనుమంతులవారికి తన భక్తులంటే ఎంతో అనురాగం. అంతేకాదు, తన స్వామి శ్రీరామచంద్రులవారి భక్తులంటే కూడా ఎంతో ప్రేమ. హనుమంతులవారిని నిత్యం స్మరిస్తే ఎటువంటి భయాలూ కలుగవు. చక్కటి ఆరోగ్యంతో మనస్సులో మంచి ఆలోచనలతో ఎల్లప్పుడూ ఎంతో ఉత్సాహంగా ఉంటారు. ఆ స్వామిని నిత్యం స్మరించేవారికి వారు తలపెట్టే కార్యాలు అన్నింటిలోను జయం కలుగుతుంది. హనుమంతులవారి ఆలయం ఉన్న గ్రామానికి ఎటువంటి అరిష్టాలు కలగవు. ఆ ఊరి ప్రజలందరూ ఎల్లుప్పుడూ సుఖసంతోషాలతో జీవిస్తారు. శ్రీ ఆంజనేయులవారి ఆలయం ఉన్న గ్రామం దరిదాపులకు కూడా ఏ దుష్టశక్తులూ ప్రవేశింపలేవు. ఆ గ్రామ రైతుల పొలాలు సస్యశ్యామలంగా ఉంటాయి. సమయానికి వానలు

కురుస్తాయి. అంతేకాదు ఆ స్వామి ఆలయం ఉన్న గ్రామాలకు అగ్ని భయం ఉండదు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగవు. ఆ స్వామి మహిమవలన ఆ ఊరిప్రజలతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల అందరు ప్రజలు కూడా శుభప్రదంగా జీవిస్తారు' అని అన్నారు.

అప్పుడు అక్కడ ఉన్న భక్తులలో ఒక్కరు విష్ణుశర్మను ఇలా అడిగారు. స్వామి హనుమంతులవారి వైభవం ఎంతో చక్కగా వివరించారు. మా ఊరిలో ఇప్పటిదాకా హనుమంతులవారికి ప్రత్యేకం ఆలయం లేదు. వెంటనే మేమందరం కలిసి స్వామికి తప్పక అద్భుతమైన ఆలయాన్ని నిర్మిస్తాం అని అన్నాడు. ఇది విన్న విష్ణుశర్మ భక్తులతో ఇలా అన్నాడు. నాయనలారా ఈ భక్తుని ఆలోచన చాలా గొప్పది. సంకల్పం గట్టిగా ఉంటే స్వామే మనలను తప్పక కరుణిస్తాడు. త్వరలోనే ఇక్కడ మనం చక్కటి హనుమంతులవారి ఆలయం నిర్మించుకోగలుగుతాం. హనుమంతులవారు ఆనంద స్వరూపుడు. ఆ స్వామి దర్శనంతో మనకు అద్భుత ఆనందం లభిస్తుంది. మనలో ఉన్న భయాందోళనలు కూడా తొలగిపోతాయి. అని చెబుతుండగా ఒక్కసారిగా ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఇలా ఒక్క క్షణంలో దట్టమైన మబ్బులు ఎలా కలిగాయా అని భక్తులందరూ ఆశ్చర్యపడి ఆకాశంవైపు చూశారు. అప్పుడు ఆకాశంలో వారికి ఒక అద్భుత దృశ్యం కనిపించింది.

మబ్బులతోపాటే ఎంతో శక్తివంతమైన మెరుపులు కూడా రాసాగాయి. ఆ మెరుపులు ఎంతో ప్రకాశవంతంగా కనిపిస్తున్నాయి. ఇంతలో ఒక్కసారిగా ఆ మబ్బులన్నీ అటూ ఇటూ కదులుతూ దగ్గరగా చేరి ఒక్కసారిగా హనుమంతులవారి రూపంలో దర్శనమిచ్చాయి. ఆకాశంలో అద్భుతమైన మెరుపులతో ఆ స్వామి దివ్యరూప దర్శనం కలిగింది. శ్రీ ఆంజనేయులవారి దివ్యదర్శన భాగ్యంతో భక్తులందరి తనువులు పులకరించాయి. అందరూ ఒక్కసారి చేతులెత్తి నమస్కరించి ఓ ఆంజనేయా! వాయుపుత్రా! మహా బలశాలీ! అంటూ ఎన్నో విధాల స్తుతింపసాగాడు. క్రమంగా ఆ రూపం మరింత పెద్దదై ఇంకా ప్రకాశవంతంగా కనపడసాగింది. ఆ స్వరూపం చుట్టూ ఉన్న అద్భుత కాంతివలన శ్రీ ఆంజనేయులవారు చక్కగా

దర్శనమియ్యసాగారు. ఆ స్వామి మెడలో చక్కటి పూలమాలను ధరించి ఉన్నాడు. చెవులకు అద్భుత కర్ణాభరణాలను ధరించి ఉన్నాడు. మెడలో దివ్యమైన స్వర్ణహారం ఉన్నది. అన్నిటికీ మించి ఆ స్వామి ఎంతో చక్కటి చిరునవ్వుతో దర్శనమిస్తున్నాడు. కింద ఉన్న భక్తులందరూ ఒక్కసారిగా ఓ ఆనంద ఆంజనేయా నమస్తే! జై ఆనంద ఆంజనేయా! అంటూ గట్టిగా స్తుతింపసాగారు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. ఆకాశంలో స్వామివారి దివ్యరూపం నెమ్మది నెమ్మదిగా పరిమాణం తగ్గుతూ చిన్నదిగా అవుతూ అతివేగంగా భూమివైపు రాసాగింది. అలా వచ్చి చిన్న శిలా ప్రతిమరూపంలో ఈ ఆలయ ప్రాంగణంలో నిలుచున్న భంగిమలో పడింది. ఈ అద్భుత సంఘటన చూసిన భక్తుల ఆనందానికి అంతు లేదు. స్వామి ఎంతో దివ్యంగా ప్రకాశిస్తూ చక్కటి చిరుదివ్య మందహాసంతో దర్శనమిస్తున్నారు. ఆ ఆంజనేయ ప్రతిమను చూసి భక్తులందరూ ఎంతో పరవశులయ్యారు.

ఆంజనేయులవారు ఇలా స్వయంభువుగా వెలియడంతో ఆ గ్రామ ప్రజలందరూ ఎంతో సంతోషపడ్డారు. అదంతా తమ పూర్వజన్మ పుణ్యఫలం అని తలచారు. అందరూ కలిసి తలొక పనికి పూనుకుని శ్రీ స్వామివారికి ఎంతో అద్భుతమైన ఆలయాన్ని నిర్మించారు. ఆ స్వామి ఆనంద ఆంజనేయుడిగా ప్రసిద్ధమై తనను నమ్మి కొలచినవారికి ఏ ఆపదలూ కలుగకుండా కాపాడసాగాడు. కొంతకాలానికి ఆలయం ఎంతో వృద్ధి చెంది అక్కడ కొలువై వున్న ఆనంద ఆంజనేయస్వామి భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షంగా ప్రసిద్ధి చెందాడు. ఓ ఆనంద ఆంజనేయా మీకివే మా నమస్కారములు. ఓ మహా బలశాలీ! నీకివే మా ప్రణామములు. ఓ భక్తవత్సలా! నీకివే మా నమస్కారములు.

# ఐదవ అధ్యాయం

## కేశవపురం హనుమంతులవారి దివ్య కథ

పూర్వకాలంలో శ్రీశైల క్షేత్రానికి దగ్గరలో కేశవపురం అనే గ్రామం ఉండేది. ఆ గ్రామ ప్రజలు ఎప్పుడూ సుఖసంతోషాలతో జీవించేవారు. అందరూ కలిసి మెలిసి ఉండేవారు. అన్ని వృత్తులవారికి చేతినిండి పని ఉండి వారి వారి సంసారాలు శుభప్రదంగా గడుస్తూ ఉండేవి. ఆ ఊరిలో ఎంతో అద్భుతంగా ఆంజనేయస్వామి వారి దేవాలయం ఉంది. ఆ స్వామి ఎంతో మహామహిమాన్వితుడిగా చుట్టు ప్రక్కల గ్రామాలలో ప్రసిద్ధి పొందాడు. ఎందరో భక్తులు నిత్యం ఆ స్వామిని దర్శిస్తూ తమ తమ కోర్కెలు తీర్చమని వేడుకునేవారు. అలా కోరిన కోర్కెలు అనతికాలంలోనే నెరవేరాక తిరిగి కుటుంబసమేతంగా వచ్చి స్వామిని దర్శించు కునేవారు. ఆ స్వామిని నమ్మి సేవిస్తే ఎటువంటి సమస్యలైనా తేలికగా పరిష్కార మవుతాయని భక్తులు భావించేవారు.

రోజులిలా గడుస్తుండగా ఒక సంవత్సరం తీవ్ర దుర్భిక్షం వచ్చింది. వర్షాలు పడక, పంటలు సరిగ్గా పండలేదు. ప్రజలు ఎంతో ఇబ్బంది పడసాగారు. సంసారం గడవటం ఎంతో కష్టంగా ఉన్నది. ఇలా ఉండగా ఒకనాడు ఆ ఊరికి కాశీనుంచి ఒక మహాపండితుడు దక్షిణ దేశయాత్ర చేస్తూ వచ్చాడు. ఊరిప్రజలందరూ ఆ పండితునికి నమస్కరించి కరువు కాటకాలనుండి బయటపడే ఉపాయం చెప్పమని వేడుకున్నారు. అప్పుడు ఆ పండితుడు కనులు మూసుకుని ధ్యానించి ఏదో స్ఫురించినవాడై వారితో ఇలా అన్నాడు. నాయనలారా మీ అందరి కష్టం నేను గమనించాను. చక్కటి వానలు కురిసి మీరందరూ శుభప్రదంగా ఉండే మార్గం ఒకటి ఉంది. అది చెప్తాను వినండి. మీ ఊరిలో ఉన్న హనుమంతుని దేవాలయంలో వచ్చే పౌర్ణమినాటితో పూర్తయ్యేలాగా మూడు రోజుల ముందునుంచి స్వామికి ఉత్సవాలు నిర్వహించండి. ఆ స్వామిని రోజూ అష్టోత్తరాలతో పూజించండి. పౌర్ణమినాడు పెద్ద ఎత్తున ఉత్సవం జరపండి. హనుమంతులవారు కరుణా సముద్రులు. ఆ స్వామి అనుగ్రహం మీ అందరిపై తప్పక కలిగి మీరందరూ సుఖసంతోషాలతో జీవిస్తారు అని అన్నాడు.

ఇది విన్న గ్రామ ప్రజలందరూ ఎంతో సంతోషించి వారు వారిలో ఒకరితో ఒకరు మాట్లాడుకుని ఆ పండితునితో ఇలా అన్నారు. స్వామీ తమరు మహా పండితులు. తేజస్సులో ఆ కాశీవిశ్వనాథునివలే ఉన్నారు. మా యందు దయ ఉంచి మా గ్రామమందే కొన్ని రోజులు ఉండి ఆ ఉత్సవాలను తమ దివ్య హస్తాలమీదుగా జరిపింపవలసిందిగా మా ప్రార్థన అని వేడుకున్నారు. అందుకు ఆ మహాపండితుడు అలాగేనని అన్నాడు. అటుతరువాత నాలుగు రోజులకు త్రయోదశి వచ్చింది. ఈ నాలుగు రోజులు ఆ పండితుడు స్వామివారి దేవాలయంలోనే విడిది చేశాడు. ప్రతిరోజూ సాయంత్రం శ్రీ హనుమంతులవారి వైభవాన్ని ఎంతో చక్కగా వివరించేవాడు. ఆ విశేషాలన్నీ వింటూ భక్తులందరూ ఎంతో ఆనందించేవారు.

త్రయోదశినాడు ఉదయమే ఉత్సవాలు ఎంతో ఘనంగా ప్రారంభమైనాయి. దేవాలయాన్ని అరటిస్తంభాలతోను, అనేక రకాల పుష్పాలతోను ఎంతో శోభాయ మానంగా అలంకరించారు. ఎటు చూసినా రంగు రంగుల పూలతో ఆలయ పరిసరాలన్నీ భక్తులకు ఎంతో ఆనందాన్ని కలుగచేస్తున్నాయి. ఊరి ప్రజలందరూ ఉదయమే లేచి శుచిగా స్నానం చేసి ఆలయానికి వచ్చారు. ఆలయ అర్చకులతోపాటు కాశీనుంచి వచ్చిన ఆ పండితుడు ప్రత్యేకపూజలు మొదలుపెట్టడానికి సిద్ధ మవుతున్నాడు. వచ్చిన భక్తులందరూ జరగబోయే పూజలను భక్తి శ్రద్ధలతో దర్శించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇలా ఉండగా ఒక్కసారిగా ఆకాశంలో పెద్ద ఎత్తున గాలిదుమారం లేచింది. ఆ గాలి తీవ్రత ఎంత ప్రచండంగా ఉన్నదంటే ఆ ధాటికి ఆలయానికి కట్టిన అరటిస్థంభాలు ఊగిపోతున్నాయి. అంతేకాదు మరొక అరగంట కాలం ఈ గాలి ఇలాగే ఉంటే ఊరి ప్రజలందరి ఇళ్ళకప్పులు ఎగిరిపోవటం ఖాయం. ఇంత ప్రచండవేగంతో వీస్తున్న గాలిని గమనించి భక్తులందరు ఎంతో భయపడ్డారు. ఏం చేయాలో ఎవ్వరికీ పాలు పోలేదు. అందరూ కలిసి ఆ కాశీ పండితునే వేడుకున్నారు. అప్పుడా పండితుడు వారితో ఇలా అన్నాడు. నాయనలారా ఏమాత్రం భయపడవద్దు. మనం కొలిచే హనుమంతులవారు వాయుపుత్రుడే కదా. మీరందరూ ఆ స్వామిని ప్రార్థించండి. అక్కడితో వాయుదేవుడు శాంతిస్తాడు అని అన్నాడు.

ఇది విన్న భక్తులందరూ ఆంజనేయులవారిని పరి పరివిధాల ప్రార్థింపసాగారు. కొందరు ఆ స్వామి గుణ గణాలను స్తోత్రాలతో స్తుతింపసాగారు. మరికొందరు భజనలు చేయసాగారు. మరికొందరు భక్తులు ఆ స్వామి మహిమలను గానం చేస్తూ నృత్యం చేయసాగారు. కొద్దిసేపటికి స్వామి అనుగ్రహంతో ఆ గాలివాన పూర్తిగా తగ్గింది. ఆ స్వామి తమను అనుగ్రహించినందుకు వారందరూ ఎంతో సంతోషించారు. ఆ స్వామిని ఎన్నోవిధాల స్తుతించారు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. స్వామి ఆలయం ఉన్న ప్రదేశమంతా దివ్యంగా మెరుస్తూ ఒక్కసారిగా అక్కడ హనుమంతులవారి దివ్యరూపం తాటిచెట్టు ప్రమాణంతో సాక్షాత్కరించింది.

ఆ అద్భుత దర్శనానికి భక్తులందరూ ఎంతో సంతోషపడ్డారు. స్వామి ఆవిధంగా ఒక్క నిమిషం కాలంపాటు అద్భుత దర్శనాన్ని అనుగ్రహించి అదృశ్యమయ్యాడు. స్వామి దర్శనభాగ్యంతో భక్తులందరిలో ఉత్సాహం మరింత పెరిగింది. రెట్టించిన ఆనందంతో భక్తులందరూ ఆ మూడు రోజులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని నిర్వహించారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొన్నది. పౌర్ణమినాడు సాయంత్రం చక్కటి వాన కురిసింది. ప్రజలందరూ ఎంతో సంతోషపడ్డారు. ఇంత చక్కటి ఉత్సవాన్ని నిర్వహించడానికి ఎంతో సహాయం చేసిన ఆ కాశీ పండితుని ఎన్నో విధాల కొనియాడారు. మరునాడు ఆ కాశీపండితుడు ఊరివారి వద్ద అందరి దగ్గర శెలవు తీసుకుని తన దేశపర్యటన కొనసాగించటానికై తిరిగి బయలుదేరి వెళ్ళాడు. ఆ ఊరి ప్రజలు ఆ పండితుని బృందానికి ఊరి పొలిమేర దాకా వెళ్ళి వీడ్కోలు పలికారు. కాశీనుంచి వచ్చిన ఆ పండితుని శివాంశ సంభూతుడైన శ్రీ ఆంజనేయులవారే తమను అనుగ్రహించడానికి పంపించాడని భావించారు.

అటు తరువాత కొద్ది రోజులకే వర్షాలు పడి పొలాలన్నీ మంచి పంటనిచ్చాయి. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లారు. అప్పటినుంచి ప్రతీ సంవత్సరంలో కార్తీకమాసంలో ఈ మూడు రోజులు ఎంతో అద్భుతంగా ఆంజనేయస్వామివారికి ఉత్సవాలు నిర్వహించేవారు. ఆ స్వామి అనుగ్రహంతో ఆ ఊరి ప్రజలందరూ కలకాలం సుఖంగా జీవించారు. ఆ ఊరి ప్రజలకే కాక ఆ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కూడా ఇక్కడ కొలువున్న హనుమంతులవారిని సేవిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

అతులిత బలధామం స్వర్ణశైలాభ దేహం
దనుజ వన కృశానుం జ్ఞానినా మగ్రగణ్యం
సకలగుణ నిధానం వానరాణా మధీశం
రఘుపతి ప్రియభక్తం వాతజాతం నమామి ॥



ఓం ఆంజనేయాయ విద్మహే

వాయు పుత్రాయ ధీమహి

తన్నో హనుమత్ ప్రచోదయాత్



మనోజవం మారుతతుల్య వేగం
జితేన్ద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి ॥